## రైతులకు రెట్టింపు లాభం వచ్చేలా ధర నిర్ణయించాలి

**సైఫాబాద్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** దేశానికి అన్నదాత లైన రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటలకు గిట్టు బాటు ధర కాకుండా కనీసం రెండింతలు లాభం వచ్చేలా ధర నిర్ణయించాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ కిసాన్ విభాగం కే ంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వాలు రైతులకు లాభదాయకమైన విధానాలు అమలు చేయడంలో విఫలం చెందాయని కిసాన్ విభాగం నాయకులు ఆరోపించారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.బి.శ్రీధర్, కిసాన్ విభాగం జాతీయ అధ్యక్షుడు సిద్ధంరెడ్డి శివశంకర్‌రెడ్డి కిసాన్ మోర్చా రాష్ట్ర నూతన కమిటిని ప్రకటించిన సంద ర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసా య రంగం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని, రైతులు ఆర్థికంగా నష్టాల పాలవుతున్నారని, వ్యవసా యం ప్రమాదకర వృత్తిగా మారడంతో అప్పుల భారంతో రైతు కుటుంబాలు కుంగిపోతున్నాయని, యువత వ్యవసాయానికి దూరం అవుతున్నారని విచారం వ్యక్తం చేశారు.

## మెగాస్టార్‌కి బండ్ల గణేష్ ఆహ్వానం

**షాద్‌నగర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** టాలీవుడ్ ప్రముఖ నిర్మాత, షాద్ నగర్‌కు చెందిన బండ్ల గణేష్ కూతురు నిశ్చితార్థ వేడుకల కోసం సుప్రీం హీరో మెగాస్టార్ చిరంజీవినిని ఆయన కుటుంబ సభ్యులు మర్యాదపూర్వకంగా కలుసుకొని ఆహ్వానించారు. మే 3న జరిగే బండ్ల గణేష్ కూతురు వివాహానికి హీరో చిరంజీవి సకుటుంబ సపరివార సమేతంగా విచ్చేయాలని గణేష్ ఆయన సతీమణి తదితర కుటుంబ సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్మాత బండ్ల గణేష్ కుటుంబ సభ్యులను మెగాస్టార్ చిరంజీవి ఆహ్వానించి ఆప్యాయంగా పలకరించారు. కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి విచ్చేస్తున్నట్లు నిర్మాత బండ్ల గణేష్ తెలిపారు.



మెగాస్టార్ చిరంజీవిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేసిన బండ్ల గణేష్







# రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్ వార్త



ధ్వంసమైన పల్లె ప్రకృతి వనం

**మానవత్వం మంటగలిసింది. పచ్చని పల్లెలకు ప్రాణవాయువునిచ్చే చెట్లపై కొందరు వ్యక్తులు తమ రాజకీయ కక్షను తీర్చుకున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏడేళ్లుగా కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్న సుమారు మూడు వేల మొక్కలను జెసిబిలతో అత్యంత నిర్దాక్షిణ్యంగా ధ్వంసం చేశారు. నందిగామ మండలం వీర్లపల్లి గ్రామంలో చోటుచేసుకున్న ఈ దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.**

## యేడేళ్ల శ్రమ.. వృథా!

### వీర్లపల్లిలో పల్లె ప్రకృతి వనం ధ్వంసం

### 3 వేల మొక్కలు నరికివేత

### బాధ్యులపై చర్యలకు డిమాండ్

**నందిగామ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** మానవత్వం మంటగలిసేలా, పచ్చని ప్రకృతిపై కొందరు వ్యక్తులు విరుచుకపడ్డారు. నందిగామ మండలం వీర్లపల్లి గ్రామంలో గత ఏడేళ్ల క్రితం నాటిన సుమారు మూడు వేల మొక్కలను కొందరు కాంగ్రెస్ నాయకులు నిర్దాక్షిణ్యంగా ధ్వంసం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లెలు పచ్చదనంతో కళకళలాడాలనే లక్ష్యంతో సుమారు ఎకరం విస్తీర్ణమున్న గ్రామ పంచాయతీ స్థలంలో ఈ పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. ఏడేళ్లుగా ఎంతో కష్టపడి సంరక్షించిన 3 వేల మొక్కలు ఇప్పుడు జెసిబి ధాటికి నేలమట్టమయ్యాయి. పండ్ల మొక్కలతోపాటు ఆహ్లాదకరమైన నీడనిచ్చే చెట్లు కనుమరుగు కావడంతో గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 19వ తేదీ సాయంత్రం పంచాయతీ కార్యదర్శికి గానీ, సర్పంచ్ పాలకవర్గానికి గానీ ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే ఈ ధ్వంసకాండ సాగింది. ఈ ఘటనపై కార్యదర్శి గిరిజ స్పందిస్తూ, ప్రకృతి వనాన్ని నాశనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అసలు ఈ మండలంలో అధికారులు ఉన్నారా లేరా అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**రాజకీయ కక్ష సాధింపేనా?**

గత సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమిని జీర్ణించుకోలేక, బిఆర్ఎస్ పార్టీకి చెందిన వ్యక్తి సర్పంచ్ కావడంతోనే కొందరు కాంగ్రెస్ నాయకులు ఈ చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తిని, ప్రకృతిని నాశనం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ చిందం పాండు మరియు వార్డు సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

# చేతికొచ్చిన పంట నేలపాలు

**రంగారెడ్డి జిల్లాలోని తలకొండపల్లి, కేశంపేట మండలాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన అకాల వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. కోతకు వచ్చిన వరి ధాన్యం నేలపాలు కావడంతో పెట్టుబడి పెట్టిన రైతులకు కన్నీటి పర్వతమే మిగిలింది. మరోవైపు భారీ వర్షానికి రోడ్లపై చెట్లు విరిగిపడి రాకపోకలకు అంతరాయం ఏర్పడగా, స్థానిక ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి వాటిని తొలగించారు. నష్టపోయిన తమను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రైతన్నలు వేడుకుంటున్నారు.**

**తలకొండపల్లి,/కేశంపేట, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం కురిసిన అకాల వర్షం బీభత్సం సృష్టించింది. గాలివానతో కూడిన వడగండ్ల వాన కారణంగా చేతికొచ్చిన పంటలు నాశనం కావడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. తలకొండపల్లి మండల కేంద్రంతో పాటు చంద్రధన గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వడగండ్ల వాన కురిసింది. దీంతో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట పూర్తిగా నేలమట్టమైంది. ఎంతో పెట్టుబడి పెట్టిన తమకు ఈ అకాల వర్షం కన్నీటిని మిగిల్చిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. మండల వ్యవసాయ అధికారి రేణుక చక్రవర్తి స్పందిస్తూ, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పంట నష్టంపై ఉన్నత అధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు. వర్షం ధాటికి స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుండి తలకొండపల్లి వెళ్లే రహదారిపై పెద్ద చెట్లు విరిగిపడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే స్పందించిన సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, మాజీ సింగల్ విండో డైరెక్టర్ యాదయ్యతో కలిసి చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. కేశంపేటలో వడగండ్ల బీభత్సం కేశంపేట మండల పరిధిలో సుమారు 30 నిమిషాల పాటు ఈదురు



తలకొండపల్లిలో రోడ్డుపై విరిగిపడ్డ చెట్లను తొలగిస్తున్న సర్పంచ్

### అకాల వర్షంతో అన్నదాత విలవిల

**నష్టపరిహారం కోసం వేడుకోలు - గాలివానకు విరిగిపడ్డ చెట్లు - స్తంభించిన రాకపోకలు**

గాలులతో కూడిన వడగండ్ల వర్షం దంచి కొట్టింది. మధ్యాహ్నం వరకు ఎండ వేడిమితో అల్లాడిన ప్రజలకు సాయంత్రం మేఘావృతమై ఉపశమనం లభించినప్పటికీ, కాసేపట్లోనే వాతావరణం భీభత్సంగా మారింది. రోడ్లన్నీ వడగండ్లతో తెల్లగా నిండిపోయాయి. ఈ అకాల వర్షం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేశంపేట మండల పరిధిలోని పలు గ్రామాలలో ఈదురు గాలులతో 30 నిమిషాల పాటు వడగండ్ల వర్షం కురిసింది. ఆకస్మత్తుగా మారిన వాతావరణం మధ్యాహ్నం వరకు బానుడి భగభగలతో అల్లాడిన ప్రజలకు సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉపశమనం లభించినప్పటికీ అది కాసేపట్లోనే బీభత్సంగా మారి గాలి వాన భీభత్సవం సృష్టించింది, రోడ్లపై ఎక్కడ చూసిన వడగండ్లతో రోడ్లన్నీ తెల్లగా దర్శనమిచ్చాయి. అకాల వర్షానికి రైతన్నలు ఆగమై నష్టమే జరుగుతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



నేలమట్టమైన వరి పంట



# నిర్భయంగా డ్యూటీకి రండి

**భద్రత కల్పిస్తాం - ప్రజారవాణాకు ఆటంకం వద్దు- ఆర్టీసీ సిబ్బందికి ఎస్పీ స్నేహ మెహ్రా పిలుపు - పరిగి డిపో పరిధిలో భద్రతా ఏర్పాట్లపై సమీక్ష**



పరిగి బస్ డిపో అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

**పరిగి ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో వికారాబాద్ జిల్లా, పరిగి పట్టణంలోని బస్ డిపో, బస్టాండ్‌లను జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా క్షేత్రస్థాయిలో సందర్శించారు. ప్రజా రవాణా కోసం భద్రతా ఏర్పాట్లపై సమీక్ష చేశారు. ఆర్టీసీ అధికారులతో చర్చించి, బస్సుల రాకపోకలు, ప్రయాణికులు ఎదుర్కుంటున్న సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బందోబస్తులో ఉన్న అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రజలకు రవాణా ఇబ్బందులు కలగకుండా చూడటమే ప్రస్తుత ప్రాధాన్యత అని, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమ్మె నేపథ్యంలో విధులకు హాజరయ్యే డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది ఎటువంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు.. "విధులకు హాజరయ్యే ప్రతి ఉద్యోగికి పోలీస్ శాఖ తరపున పూర్తిస్థాయిలో రక్షణ కల్పిస్తామని,ఎవరైనా విధులను అడ్డుకోవాలని చూసినా లేదా ప్రభుత్వ ఆస్తులకు, బస్సులకు నష్టం కలిగించాలని ప్రయత్నించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పి హెచ్చరించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు తెలిపే హక్కు ఉన్నప్పటికీ, అది సామాన్య ప్రజల జీవనానికి, ప్రయాణాలకు ఇబ్బందిగా మార కూడదని పేర్కొన్నారు. స్వచ్ఛందంగా విధులకు రావాల నుకునే సిబ్బందికి తగిన భద్రత కల్పిస్తామని తెలిపారు. ప్రయాణికులు కూడా ఎటువంటి ఆందోళన చెందకుండా తమ ప్రయాణాలను కొనసాగించవచ్చని, పోలీస్ యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు.



షాద్‌నగర్‌లో కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న బిజెపి నాయకులు

**కమిటీలతో కాలయాపన వద్దు**

**షాద్‌నగర్ :** కమిటీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయకుండా ఆర్టీసీ కార్మికుల సమస్యను తక్షణమే పరిష్కరించాలని బిజెపి సీనియర్ నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబయ్య పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. షాద్ నగర్ బస్ స్థాండ్ లోని ఆర్టీసీ కార్మికులను కలిసి వారికి మద్దతు పలికారు. కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చి ఆర్టీసీ కార్మికులను ఆదుకోవాలని కోరారు.

## సమ్మెకు మద్దతివ్వకపోతే ప్రైవేటు బస్సులను తిరగనివ్వం: బిఎస్‌పి

**షాద్‌నగర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లాలోని షాద్నగర్ బస్సు డిపోలో టీజీ ఆర్టీసీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు బహుజన్ సమాజ్ పార్టీ రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం కమిటీ సంపూర్ణ పూర్తి మద్దతు తెలిపారు. షాద్‌నగర్ బస్ డిపోలో చేపడుతున్న నిరవధిక సమ్మెలో పాల్గొన్న బహుజన్ సమాజ్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్ మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులు చేపడుతున్న నిరవధిక సమ్మెకు ఆర్టీసీ సంస్థల్లో వాహనాలు నడుపుతున్న ప్రైవేట్ బస్సుల యజమానాలు ఆర్టీసీ కార్మికుల వైపు నిలబడాలన్నారు. లేనిపక్షంలో ప్రవేట్ ఆర్టీసీ బస్సులను తిరగనియ్యమని అల్టిమేట్ జారీ చేశారు, ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు బోర్ర అనంతరాములు, బిఎస్పీ పార్టీ షాద్నగర్ ఇన్చార్జిలు గుండేటి నర్సింలు మరియు జి బాలయ్య, షాద్నగర్ అసెంబ్లీ అధ్యక్షులు అబ్బి జగన్, షాద్నగర్ అసెంబ్లీ కార్యదర్శి కొండేటి మహేందర్, షాద్నగర్ టౌన్ ప్రెసిడెంట్ నీరటి రాజు, కొందుర్గు మండల అధ్యక్షులు రాపోలు రమేష్ తెలంగాణ రమేష్, ఫరూఖ్‌నగర్ మండలం ఉపాధ్యక్షులు చిలకమర్రి పరమేష్, బీఎస్పీ నాయకులు బైండ్ల మల్లేష్, మొగిలిగిద్ద జయప్రకాష్, నందిగామ మండల నాయకులు కొంగరి రవి కుమార్, షాద్నగర్ 15వ వార్డు కన్వీనర్ కొంకల అయ్యప్ప ముదిరాజ్, బొమ్మగల వెంకటయ్య, సిఐటియు రాజు , ఆర్టీసీ జేఏసీ నాయకులు నర్సింలు మాకం స్వాములయ్య ,ఏఆర్ రెడ్డి ,అర్జున్ కుమార్, రాజు జ్యోతి, విజయలక్ష్మి త్రి, డివి స్వామి దోనూర్ రవి తెలంగాణ నాయకులు ఎర్ర నర్సింలు, జనార్ధన్, అర్జున్ కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.



ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా ర్యాలీ చేపట్టిన బిఎస్పి నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దీపక్ తివారి

## భూభారతి పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి

**- కలెక్టర్ దీపక్ తివారి**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** భూసంబంధిత సేవలను సులభతరం చేయడానికి అమలు చేస్తున్న భూభారతి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులకు ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశము హాలు నందు అన్ని మండలాల తహసిల్దార్లతో ఏర్పాటు చేసిన సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా, మండల స్థాయిలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తూ, పెండెన్సీ తగ్గించడానికి అధికారులు వేగవంతమైన చర్యలు చేపట్టాలని అన్నారు. భూస్వామ్య మార్పులు, పాస్‌బుక్ అప్‌డేషన్, ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమయపాలనతో సేవలు అందించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి దరఖాస్తును సమీక్షించి, నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించడం లక్ష్యంగా పెట్టుకోవాలని, సాదా బైనామా, మ్యుటేషన్, భూ సమస్య లు మండల పరిదిలో ఉన్న వాటిని పూర్తి చేయాలని తెలిపారు. మాడ్యుల్ వారిగా రిపోర్ట్ ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో అర్బన్ ఏరియాలలో జనగణన పై ప్రత్యేక ద్రుష్టి సారించాలని, బిఎల్ఓ లు, ఎఆర్ఓలు, ఇండ్ల గణన ప్రక్రియలు, మ్యాప్ తయారీ, ప్రక్రియను పోలింగ్ స్టేషన్ వారిగా సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గణన చేయాలని తెలిపారు. కుటుంబాల వివరాలు పూర్తిగా నమోదుచేసి 80శాతం పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా మొదటి విడత ఇండ్ల గణన ప్రక్రియను పూర్తి చేయాలనీ తెలిపారు.

అక్రమ ఇసుక రవాణా జరుగకుండా ఇసుక రీచ్ ల దగ్గర బాద్యత కలిగిన అధికారులను ఏర్పాటు చేయాలనీ, ఆథరైజ్డ్ ఇసుక రీచ్ లలో ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకే అన్ని డాక్యుమెంట్స్ చూసి పర్మిషన్ ఇవ్వాలని అన్నారు. పోలీస్ శాఖా వివిధ శాఖ ల అధికారుల సమన్వయంతో పని చేయాలనీ అధికారులకు ఆదేశించారు. మీసేవ సెంటర్లకు వచ్చిన దరకాస్తులపై దృష్టి సారించి ప్రజలు , విద్యార్థులు ఎవ్వరు కూడా ఇబ్బంది పడకుండా ఆదాయము, కులం, దృవీకరణ సర్టిఫికెట్ లను జారీ చేయాలనీ ఆదేశించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటా చారి, ఆర్‌డిఓ లు అనిత, వాసు చంద్ర, మైనార్టీ వెల్ఫేర్ అధికారి రాజేశ్వరి తహసిల్దార్లు పాల్గొన్నారు.

## పిహెచ్‌సిలో ల్యాబ్ ఏర్పాటుకు కలెక్టర్ హామీ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి వైద్యాధికారులకు సూచించారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా పరిధిలో నిజాంపేట్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. రోజుకు ఎంత మంది ఓపి ఉంటుందని, ఆసుపత్రిలో మౌలిక వసతుల గురించి వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పార్టిషన్, ల్యాబ్, స్టోర్ రూమ్ చేయించాలని మెడికల్ ఆఫీసర్ కోరగ అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ అన్నారు. స్థానికంగ జనాభా ఎక్కువ సంఖ్యలో ఉన్నందున ఆశావర్కర్లు కావాలని కలెక్టర్‌ను ఆమె కోరారు. ఎఎన్‌సి చెక్‌అప్‌లు, ఎనిమియా కేసుల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఫార్మాసిస్ట్‌కు మందుల నిల్వలను సమర్దవంతంగ నిర్వహిస్తూ, ఎమర్జెన్సీ కార్నర్‌ను సక్రమంగా నిర్వహించాలన్నారు. పేషంట్లకు మందులు అందించే సమయంలో ఎక్స్పైరీ డేట్‌లను చెక్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆరోగ్యకేంద్రంలోని రికార్డులను తనిఖీలు చేశారు. వ్యాక్సినేషన్, ఇమ్మునైజేషన్‌ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం అవసరమైన నిధులు సమకూరుస్తామన్నారు.



పిహెచ్‌సిని తనిఖీ చేస్తున్న కలెక్టర్

## ఆర్టీసి కార్మికుడి ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

**శామీర్‌పేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** ఆర్టీసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం శామీర్‌పేట మండలంలోని హకీంపేట్ ఆర్టీసి డిపో వద్ద సమ్మెలో ఉన్న కార్మికులు సమ్మెలో భాగంగా మౌన దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ హకీంపేట్ డిపోను సందర్శించి ఆర్టీసి కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఆర్టీసి కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోవటం వల్లనే కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితికి చేరిందని, ఆర్టీసి కార్మికుడు శంకర్‌గౌడ్ ఆత్మహత్య చేసుకోవటానికి కారణం ప్రభుత్వం అని ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఆర్టీసి డ్రైవర్ శంకర్‌గౌడ్‌ది ఆత్మహత్య కాదని ప్రభుత్వ హత్య అని అన్నారు. ఆర్టీసి కార్మికులు సమ్మెలో ఉండటం రెండవ రోజునే వరంగల్ జిల్లాలో ఆర్టీసి డ్రైవర్ శంకర్‌గౌడ్ ఆత్మహత్య చేసుకోవటం అందరిని కలవర పర్చిందన్నారు. హకీంపేట్ ఆర్టీసి డిపో వద్ద శంకర్‌గౌడ్ చిత్రపటం వద్ద ఎంపి ఈటల రాజేందర్ నివాళులు అర్పించారు. ఆర్టీసి కార్మికులకు అండగా ఉంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ ఎంపిపి బి.చంద్రశేఖర్‌యాదవ్, రాష్ట్ర నాయకురాలు ఎన్.హైమారెడ్డి, పలువురు నాయకులు, ఆర్టీసి కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



హకీంపేట్ డిపోలో మాట్లాడుతున్న ఈటల

## మన్‌చన్‌పల్లిలో ముదురుతున్న భూ వివాదం

**కోట్ల రూపాయల లావాదేవీలు.. అర్ధరాత్రి కూల్చివేతలు**

**రూ. 8 కోట్లు చెల్లించినా దక్కని పొజిషన్**

**బాధితుడు వట్టేలా మల్లేష్ ఆవేదన**

**నిషేధిత జాబితా భూములపై కోట్లాది రూపాయల దందా?**

**మహేశ్వరం, ఏప్రిల్24, ప్రభాతవార్త:** మహేశ్వరం మండల పరిధిలోని మన్‌చన్‌పల్లి గ్రామంలో కోట్లాది రూపాయల భూ వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీస్తోంది. బాధితుడువట్టేలా మల్లేష్ విలేకరులతో మాట్లాడుతూ 2005లో దద్వయ అంజప్ప, మల్లప్పల నుండి 13 ఎకరాల భూమిని కోటి రూపాయలకు అగ్రిమెంట్ చేసుకున్నట్లు తెలిపారు. అయితే ఆ భూమి అప్పటికే నిషేధిత జాబితాలో ఉండటంతో, పట్టాదారులు పొజిషన్ ఇవ్వకుండా వాయిదా వేస్తూ వస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో 2021లో రూ. 7 కోట్ల 20 లక్షలతో కలిపి ఇప్పటివరకు భారీ స్థాయిలో డబ్బులు చెల్లించినప్పటికీ, పట్టాదారులు మాట తప్పారని వాపోయారు. ఇదే క్రమంలో మధుసూదన్ రెడ్డి, రాజా సక్సేనా అనే వ్యక్తులు దాదాపు 100 ఎకరాల భూమిని తీసుకున్నారని, వారు స్థానిక రైతులను భయభ్రాంతులకు గురి చేస్తూ ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివాదం మరింత ముదిరి, అర్ధరాత్రి సమయంలో సుధాకర్, అతని అనుచరులు పొలం చుట్టూ ఉన్న ప్రీకాస్ట్ నిర్మాణాలను తొలగించి నేలమట్టం చేయడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది.




నిర్మాణాలను తొలగించి నేల మట్టం చేసిన దృశ్యం



ప్రొహిబిటెడ్ లిస్ట్‌లో ఉన్న భూములపై లావాదేవీలు జరపడం చట్టవిరుద్ధమని నిపుణులు హెచ్చరిస్తుండగా, తనకు తక్షణమే పొజిషన్ కల్పించి మోసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధి తుడు రెవెన్యూ, పోలీస్ అధికారులను కోరుతున్నారు. ప్రభుత్వం స్పందించి భూముల రక్షణపై స్పష్టమైన హక్కులు, రికార్డుల పరిరక్షణపై దృష్టి సారించాలని స్థానిక రైతులు ఆశిస్తున్నారు.



ఆమనగల్లులో సత్యసాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

## ఘనంగా సత్యసాయిబాబా ఆరాధన దినోత్సవం

**ఆమనగల్లు, ఏప్రిల్ 24,ప్రభాతవార్త:** భగవాన్ శ్రీసత్యసాయిబాబా ఆరాధన దినోత్సవాన్ని శుక్రవారం భక్తులు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆమనగల్లు శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సమితి అధ్యక్షులు దొంతుశ్రీను అధ్యక్షతన పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ మేరకు సత్య సాయి మందిరంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈసందర్భంగా భక్తులు ఆలపించిన భజన కీర్తనలతో సత్యసాయి నామస్మరణం మారుమ్రోగింది. భక్తులరాకతో మందిరం ఆవరణ కోలాహలంగా దర్శనమిచ్చింది. చిన్న, పెద్ద తేడా లేకుండా అన్ని వర్గాల భక్తులు ఆరాధన దినోత్సవంలో పాలుపంచుకున్నారు. అనంతరం ఆమనగల్లు ఆర్టీసి బస్టాండ్ ఆవరణలో ఏర్పాటుచేసిన నారాయణ సేవ (అన్న ప్రసాద వితరణ) కార్యక్రమాన్ని కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, ఎర్రవోలు మహేష్, పుల్లారెడ్డి అనూష శ్రీశైలంతో కలిసి ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్ నేనావత్ పత్యానాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పెద్ద ఎత్తున భక్తులు ఆరాధన దినోత్సవంలో పాల్గొని సాయిబాబాను ప్రార్థించారు. కార్యక్రమంలో సమితి కమిటీ సభ్యులు డాక్టర్ దొంతు పుల్లయ్య, ఆమనగంటి సంజీవ్ కుమార్, గోల్డురాము, గుర్రం సురేష్, పల్లె అల్లాజి గౌడ్, గాజుల శ్రీను, బ్రహ్మాచారి, తిరుపతయ్య, దాస శ్రీను, జగన్మోహన్, ఆర్టీఏ శేఖర్, శ్రీశైలం, పోలిశెట్టి శ్రీను, పోలిశెట్టి నందు, శ్రీధర్, నాగిళ్ల లింగం, నాగిళ్ల శంకర్, రాజ వర్ధన్ రెడ్డి, కృష్ణారెడ్డి, ఆలేటి నారాయణ సాగర్, రాము గోల్డ్, ప్రభాకర్, ఆటో మల్లేష్, గంజి వెంకటేష్, దొంతు సంధ్య, సృజన, శైలజ, అలివేలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రీయ ఎరువులతోనే అధిక దిగుబడులు

-ఎడిఎ శోభారాణి

**ఆమనగల్లు, ఏప్రిల్24, ప్రభాతవార్త:** పంటల సాగులో రైతులు సేంద్రీయ ఎరువులను వినియోగిస్తే ఆశించినంత అధిక పంట దిగుబడులు పొందవచ్చుని ఆమనగల్లు డివిజన్ వ్యవసాయ అధికారిణి కె.శోభారాణి అన్నారు. యూరియా అధిక వినియోగంతో భూసారం దెబ్బతిని పంట దిగుబడులు తక్కువగా వస్తుంటాయని ఆమె



పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని రైతు వేదిక భవనంలో శుక్రవారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎఒ శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన రైతులకు యూరియా, సేంద్రీయ ఎరువుల వాడకం, అమలులో ఉన్న ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఎడిఎ కె. శోభారాణి, తహశీల్దార్ ఫహీం ఖాద్రితోపాటు పలు గ్రామాల సర్పంచులు హాజరైనారు. ఈసందర్భంగా సాగులో అవలంబించవలసిన పద్ధతులు, విధానాల గురించి రైతులకు వివరించారు. యూరియా వాడకంపై రైతులు ఆధారపడవద్దని సూచించారు. యూరియా స్థానంలో సేంద్రీయ ఎరువుల వినియోగం పెంచుకుని లబ్దిపొందాలన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను లబ్దిపొందాలంటే తప్పకుండా ప్రతి రైతు తన పేరును వ్యవసాయశాఖ పోర్టల్‌లో నమోదు చేసుకుని ఉండాలని సూచించారు. ఈమేరకు పలువురు రైతులు అడిగిన సందేహాలకు వ్యవసాయాధికారులు నివృత్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వడ్త్యావత్ శ్రీనునాయక్,సరిత, జంగమ్మ, వెంకటయ్య, శ్రీలత, యాదయ్య, ఏఈఓలు భూదేవి, మీనాక్షి, ప్రభావతి, బాలకృష్ణ, ఎంపీఓ లక్ష్మణ్, ఏఎస్ఐ మురళీధర్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీలు తదితరులు ఉన్నారు.

## రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి..


సమావేశంలో మాట్లాడుతున్న తహసిల్దార్ జగదీశ్వర్

**జిల్లేడు చౌదరిగూడెం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** మండలంలోని ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో తప్పనిసరిగా తన పేరును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ జగదీశ్వర్, మండల వ్యవసాయ అధికారి రాజేందర్ రెడ్డి లు సూచించారు.ఫార్మర్ రిజిస్ట్రేషన్ పై శుక్రవారం చౌదరిగూడ రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారులు,మీసేవ ప్రతినిధులు, గ్రామ పరిపాలన అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈనెల ఏప్రిల్ 25 నుంచి 30వ తేదీ వరకు మండలంలో ప్రత్యేక డ్రైవ్ ఉంటుం దని ఈ అవకాశాన్ని రైతులందరూ సద్విని యోగం చేసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్ర 1మంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ సలీం ,వ్యవసాయ విస్తరణ అధికారులు స్వాతి , సోనీశ్రీ, గ్రామ పరిపాలన అధికారులు పాల్గొన్నారు.

**కేశంపేటలో...**

**-ఇంచార్జ్ ఏవో రామ శివ రావు**

**కేశంపేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :**

భూమి కలిగి ఉన్న ప్రతి రైతు ఫార్మా రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఇన్చార్జి ఏవో రామశివరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .భూమి కలిగిన ప్రతి రైతుకు సంబంధించిన భూ యాజమాన్య వివరాలు, వ్యక్తిగత సమాచారం ఆధారంగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయడం జరుగుతుందనిముఖ్యంగా పీఎం కిసాన్ పథకము తోపాటు ప్రభుత్వం అందించే ప్రతి పథకం పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరిగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని తెలిపారు.రాబోయే వ్యవసాయ సీజన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అయినా రైతు భరోసా, రుణమాఫీ మొక్కజొన్న,పత్తి,ధాన్యం కొనుగోలు, యూరియా,ఇతర ఎరువుల పంపిణీకి ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అవుతుందని ఆయన అన్నారు రైతులు తమ ఆధార్ కార్డు, భూ యాజమాన్య పాస్ బుక్కు,ఆధార్ కు అనుసంధానమైన మొబైల్ నెంబర్ తో సమీపంలోని వ్యవసాయ విస్తరణ అధికారి లేదా సమీప మీసేవ కేంద్రాలను సంప్రదించి వెంటనే ఫార్మర్ ఐడి నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు . ఈనెల ఏప్రిల్ 22 నుంచి 30వ తేదీ వరకు మండలంలో ప్రత్యేక డ్రైవ్ ఉంటుందని ఈ అవకాశాన్ని మండల పరిధిలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు . ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ గీత, ఏ ఈ ఓ లు వినయ్,నికిల్ రెడ్డి,రాజేశ్వరి, జీపీవో లు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న అధికారులు

# ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిడిఒ సర్పంచ్ వార్డు సభ్యులు

**యాచారం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా యాచారంలో సర్పంచ్ మస్కు అనిత శరణం అధ్యక్షతన శుక్రవారం గ్రామసభలో మండల అభివృద్ధి అధికారి రాధా రాణి ముఖ్యఅతిథిగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పరిపాలనలో వికేంద్రీకరణ జరపడం 73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీలకు రాజ్యాంగం హోదా కల్పించిన సందర్భంగా ఏప్రిల్ 24వ తేదీని జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకుంటున్నామని తెలియజేశారు. అదేవిధంగా పరిపాలనలో అన్ని వర్గాలను కలుపుకొని గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని తెలియజేశారు. గ్రామ సర్పంచ్ మస్కు అనిత మాట్లాడుతూ.. రాజ్యాంగం ఇచ్చిన ఫలాల వల్ల ఈరోజు తను ఈ స్థాయిలో ఉన్నానని తెలియజేశారు.ఈ సందర్భంగా ప్రతిజ్ఞను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ,స్థాయి అధికారులు ఉప సర్పంచ్ మంగ కృష్ణ వార్డు సభ్యులు రెడ్డి లక్ష్మీ వెంకట్ రెడ్డి, సాజిద్ భాయ్, పాషా బాయ్, మస్కు యాదయ్య, మారోజు ప్రదీప్, నారిమల్ల శ్రీకాంత్, నారిమల్లె లావణ్య వెంకటేష్. గ్రామస్తులు పాల్గొన్నారు.


పంచాయతీ రాజ్ దినోత్సవంలో పాల్గొన్న కార్యదర్శి,సర్పంచ్,ఉపసర్పంచ్,వార్డు సభ్యులు

### గ్రామ ప్రజల అందరి సహకారం ఉంటేనే గ్రామ అభివృద్ధి సాధ్యం

**కేశంపేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :**

కేశంపేట మండల పరిధిలోని గ్రామాలలో పంచాయతీరాజ్ దినోత్సవం వేడుకలను ఆయా గ్రామాల సర్పంచి పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేశంపేట మండల పరిధిలోని కోనాయపల్లి గ్రామంలో శుక్రవారం పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ పంచాయతిలో సర్పంచ్ సొప్పరి ధనలక్ష్మి రామకృష్ణ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు పాల్గొని పంచాయతీ రాజ్ వ్యవస్థ ప్రాముఖ్యతను గుర్తుచేసుకున్నారు.సర్పంచ్ మాట్లాడుతూ గ్రామం అభివృద్ధి చెందాలంటే మన గ్రామ ప్రజల అందరి సహకారం ఉంటేనే గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, అంగన్వాడీ టీచర్లు,ఆశవర్కర్లు, మహిళలు, యువత పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# ఫ్యూచర్ సిటీ భూయజమానులకు పరిహారం చెల్లించాలి

**యాచారం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** యాచారం మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో ఫ్యూచర్ సిటీ పార్కు కోసం తీసుకుంటున్న భూములకు సరైన నష్టపరిహారం చెల్లించాలి అట్టి భూములలో ఎస్సీ ఎస్టీ బీసీ రైతులే అధికంగా ఉన్నారని అలాంటి రైతులు అందరికీ రికార్డులో ఉన్న భూమితో పాటు కబ్జా భూమికి కూడా పూర్తి నష్టపరిహారం ఇవ్వాలని మొండిగౌరెల్లి రైతులు యాచారం తాసిల్దార్ కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి. రైతులు. మాట్లాడుతూ గ్రామంలోని అనేక దళిత రైతులకు అసైన్ భూములే ఉన్నాయని అలాంటి రైతులందరికీ ఎలాంటి రికార్డు లేకపోయినా కబ్జాలో ఉంటే పూర్తి నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గ్రామంలో కొంతమంది రైతులకు ఎలాంటి పాసుబుక్కులు రికార్డు లేదని అలాంటి రైతులకు కూడా కబ్జా చేసుకుని కొన్ని సంవత్సరాల నుండి దున్ని సాగు చేసుకుంటున్నారు ఆ రైతులను కూడా ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని ఖచ్చితంగా ఎంజాయ్మెంట్ సర్వే చేసి నష్టపారం చెల్లించే విధంగా స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. సాగు చేస్తున్న గౌరెల్లి కంచ భూములలో మరింత నష్టపరిహారం పెంచే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు.ప్రతి రైతుకు నష్టపరిహారం చెల్లించకపోతే భూసేకరణ ఆపుతామని మొండిగౌరెల్లి గ్రామ రైతులు తాసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు నేటి నుంచి ఈ నిబంధనలకు అధికారులు అనుమతిస్తేనే భూ సర్వే చేయుటకు


తాసిల్దార్ కు వినతిపత్రం అందజేస్తున్న మొండి గౌరెల్లి గ్రామస్తులు

ప్రజలందరూ సహకరిస్తామని గుర్తు చేశారు

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఏడెల్లి యాదమ్మ యాదయ్య. మాజీ సర్పంచి మర్పల్లి అంజయ్య యాదవ్.. మాజీ వార్డు సభ్యులు ఎట్టి లక్ష్మయ్య. సంఘం రవి. కట్టెల కృష్ణయ్య. కర్నాటి. ముత్యాలు. కర్నాటి యాదయ్య .కర్నాటి నరేష్. మస్కూరి జంగయ్య. మర్పల్లి బాలరాజ్ .నక్క శ్రీనివాస్ యాదవ్ .మర్పల్లి రమేష్ యాదవ్. మొండి గౌరెల్లి. గ్రామ రైతులు మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అలియాబాద్‌లో ఎడ్ల బండ్ల ర్యాలీ

**శామీర్‌పేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈ నెల 25న (శనివారం) కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తున్నందున ముందస్తుగా అలియాబాద్ గ్రామంలో తెలంగాణ జాగృతి నాయకులు ఎడ్ల బండ్ల ర్యాలీని నిర్వహించారు. శుక్రవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ గ్రామంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు తెలంగాణ జాగృతి నాయకులు ఎడ్ల బండ్ల ర్యాలీని నిర్వహించారు. అయితే మేడ్చల్ మండలంలోని మునీరాబాద్‌లోని ఓ పంక్షన్‌హాల్‌లో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేసి శనివారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటిస్తున్నందున ముందస్తుగా అలియాబాద్ గ్రామంలో నాయకులు ఎడ్ల బండ్లతో, బతుకమ్మలను మహిళలు పట్టి ర్యాలీని నిర్వహించారు. కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీని ప్రకటించిన తరువాత అక్కడే బహిరంగసభ జరుగుతుందని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు,మహిళలు


అలియాబాద్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ ఏర్పాటు చేస్తున్నందున ముందస్తుగా ఎడ్లబండి ర్యాలీ

విచ్చేయనున్నట్లు తెలిపారు. అలియాబాద్‌లో జరిగిన ఈ ఎడ్ల బండ్ల ర్యాలీలో తెలంగాణ జాగృతి నాయకులు కిషన్‌నాయక్, కుమార్, మారయ్య, సదానంద్, శశిధర్, గణేశ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యానికి గ్రామపంచాయతీలు పునాది లాంటిది

**సర్పంచుల సంఘం అధ్యక్షులు కటికెల శేఖర్ యాదవ్**

**తలకొండపల్లి, ఏప్రిల్24,ప్రభాత వార్త;**

ప్రజాస్వామ్యానికి గ్రామపంచాయతీ పునాది లాంటిదని ఆవ్యవస్థ బలంగా ఉన్నప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యపడుతుందని సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు,తలకొండపల్లి సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్ అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత గ్రామీణ స్వయం పాలనకు పునాది పల్లెలను శక్తివంతం చేయడంలో పంచాయతీరాజ్ వ్యవస్థ ఎంతో కీలకంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం అన్నారు. గ్రామాల్లో పచ్చదనం ఉండాలంటే ప్రతి ఒక్కరు చెట్లు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలన్నారు వీధులన్నీ పరిశుభ్రంగా ఉంటే గ్రామం మరింత అభివృద్ధిలో ముందుకు సాగుతుందన్నారు పంచాయతీరాజ్ ద్వారా వస్తున్న నిధులను గ్రామ అభివృద్ధికి సక్రమంగా వినియోగించి గ్రామ అభివృద్ధిలో పార్టీలకు అతీతంగా ముందుకు రావాలన్నారు.

గ్రామంలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కారానికి కృషి చేస్తున్నామని ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత,మురికి కాలువల, నిర్మాణం సిసి రోడ్లు, రోడ్ల విస్తరణ,మంచినీటి సమస్యలను,వీధి దీపాలు,తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి తలకొండపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోటేశ్వర్,కార్యదర్శి సత్యం తోపాటు వార్డు సభ్యులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్ ఉప సర్పంచ్ నూకం కోటేశ్వర్, పంచాయతీ కార్యదర్శి సత్యం, వార్డు సభ్యులు పద్మ



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచుల సంఘం అధ్యక్షులు శేఖర్ యాదవ్

కిషోర్, ఇట్టామోని వెంకటేష్, నాయిని లక్ష్మీ కాంత్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రయ్య, పద్మ విఠల్, అనుపటి అంజి, పరిశుద్ధ కార్మికులు గ్రామస్తులు మహిళలు మరియు తదితరులు పాల్గొన్నారు.

**రాంపూర్ లో...**

తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామములో శుక్రవారం నాడు జాతీయ పంచాయతీ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామసభ నిర్వహించారు.సర్పంచ్ వట్టల నిర్మల శ్రీశైలం యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాంపూర్ పరిధిలోని సంగయపల్లీ గ్రామములో విద్యుత్తు,మురుగు నీటి కోసం అండర్ డ్రైనేజ్,త్రాగునీరు,రోడ్సిమొక్కలు పెంచుట తదితర విసయలపై సమావేశంలో చర్చించినట్లు సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమములో సర్పంచ్ నిర్మల,శ్రీశైలం యాదవ్,ఉప సర్పంచ్ సప్పిడి ఆంజనేయులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థి సంఘం నుండి సర్పంచ్ వరకు లాల్‌సింగ్ తాండ సర్పంచ్ రాథోడ్ శ్రీనివాస్ నాయక్

**కుల్కచర్ల,ఏప్రిల్,23 ప్రభాతవార్త:** ఉద్యమాలు, సామాజిక పోరాటాల నుండి వచ్చి క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలపై పోరాడుతూ.. సర్పంచ్ స్థాయికి ఎదిగిన నాయకుడు లాల్‌సింగ్ తాండ సర్పంచ్ రాథోడ్ శ్రీనివాస్ నాయక్ .శ్రీనివాస్ నాయక్ ఒక చిన్న గిరిజన తాండ సామాన్య రైతుకుటుంబంలో జన్మించి చిన్న తనం నుంచే గ్రామంలో మండలంలో. గిరిజన ప్రజలకు తాండలలో నీటికొరత, విద్యుత్ సమ స్యలు, భూసమస్యలపై,విద్యార్థుల ఎదుర్కొంటు న్న సమస్యలపై చిన్న చిన్న బృందాలుగా ఏర్పడి పోరాటం మొదలుపెట్టారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన తన చుట్టుప్రక్కల గ్రామ, తాండా ప్రాంత ప్రజలను చైతన్యం చేశారు.

ధర్నాలు, రాస్తారోకోలు,చురుగ్గా పాల్గొని,ప్రజల సమస్యలపై విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం చేశారు. ఉద్యమసమయంలో అనేక సార్లు పోలీసుల నిర్బంధాలను కేసులను ఎదుర్కొ న్నారు. గ్రామస్తుల కోరిక మేరకు,ఉద్యమ పోరాటాల స్ఫూర్తితో డబ్బు,మద్యం ప్రభావం లేని, నిజాయితీగల నాయకత్వం కావాలనే ఉద్దే శ్యంతో ఆయన సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేశారు.

క్షేత్రస్థాయిలో ఆయన చేసిన పనులు గ్రామ ప్రజలతో ఆయనకున్న అనుబంధం వల్ల, ఎన్నికయ్యారు.

**సర్పంచ్ బాధ్యతలు లక్ష్యాలు...**

చిన్న తనంలోనే శ్రీనివాస్ నాయక్ సర్పంచ్‌గా ఎన్నికైయారు.



తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న శ్రీనివాస్ నాయక్

ప్రతిపైసా లెక్క ప్రజలకు తెలిసేలా గ్రామ సభలను నిర్వహించడం,రోడ్లుడ్రైనేజీలు, వీధి దీపాల వంటి మౌలిక వసతుల కల్పన, గ్రామంలోని పాఠశాల, ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉండేలా, అభివృద్ధిచేయడం, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్య లపై ఎప్పటికప్పుడు పోరాడుతూ, గ్రామాన్ని ఆదర్శంగా నిలపడమే లక్ష్యమని చెపుతున్నారు.


గ్రామ సభల్లో పాల్గొన్న సర్పంచ్

## గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

సర్పంచ్ గడం వెంకటయ్య

**కుల్కచర్ల,ఏప్రిల్,24 ప్రభాతవార్త:** గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ గడం వెంకటయ్య అన్నారు.శుక్రవారం మండల పిరంపల్లి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు.ఈ గ్రామ సభలో గ్రామానికి సంబంధించిన పలు సమస్యలు, అభివృద్ధి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా సర్పంచ్ శకుంతల కేశవులు మాట్లాడుతూ..గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. గ్రామ సభలో ప్రస్తావించిన ప్రతి అంశాన్ని పరిశీలించి, దశలవారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శాంత మొగులయ్య పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణ,ఫీల్డ్‌అసిస్టెంట్ వెంకటయ్య, మాజి సర్పంచ్ సత్యన్నారాయణ, వార్డు సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలం నాటికి మొక్కలు సిద్ధం కావాలి

ఎంపిడిఓ రామకృష్ణ నాయక్


మొక్కల నర్సరిని పరిశీలిస్తున్న ఎంపిడిఓ, సర్పంచ్

**కుల్కచర్ల,ఏప్రిల్,24 ప్రభాతవార్త:** వచ్చే వర్షకాలం నాటేందుకు మొక్కలు సిద్ధం కావాలని ఎంపిడిఓ రామకృష్ణ నాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కామునిపల్లి గ్రామంలో సర్పంచ్ మోర సత్యమ్మ వెంకటేష్‌తో కలిసి నర్సరీని సందర్శించారు.ఈ సందర్భంగా ఎంపిడిఓ రామకృష్ణ నాయక్ మాట్లాడుతూ.. వేసవి కాలం మొక్కలు ఎండిపోకుండా నీటిని అందించాలని, మొక్కలు వర్షాకాలం నాటికి మొక్కలు సిద్ధం కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలోపంచాయతీ కార్యదర్శి, మరియు ఉప సర్పంచ్ సూర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వేలంలో త్రై బజార్‌ను దక్కించుకున్నందుకు సన్మానం

**తలకొండపల్లి ఏప్రిల్ 24 ,ప్రభాతవార్త;**

తలకొండపల్లి మండల పరిధిలోని చుక్కాపూర్ గ్రామంలో శుక్రవారం నాడు నిర్వహించిన గ్రామపంచాయతీ త్రై బజార్ వేలం71 వేల రూపాయలు పలికింది. గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన ఈ వేలం పాటలో సర్పంచిగా పోటీ చేసిన కాగుల కుమార్ ఈ వేలం పాటలో 71 వేల రూపాయలకు త్రైబజార్‌ను దక్కించుకున్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ అతను శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లావణ్య శ్రీనివాస్, తో పాటు గ్రామ కార్యదర్శి వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్టకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

**తలకొండపల్లి ,ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**


దేవాలయం కరపత్రం విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

తలకొండపల్లి మండల పరిధిలోని చౌదర్పల్లి గ్రామంలో నిర్మించిన ఆంజనేయ స్వామి దేవాలయం లో విగ్రహ ప్రతిష్టకు రావాలని కోరుతూ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆహ్వాన పత్రం అందించారు. శుక్రవారంనాడు హైదరాబాదులోని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్వగృహంలో కలిసి చౌదర్పల్లి గ్రామంలో నూతనంగా ఆంజనేయస్వామి దేవాలయాన్ని నిర్మించామని, మే 3న విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఉన్నందున హాజరుకావాలని సందర్భంగా ఆయనను కోరారు. ఈ కార్యక్రమంలో అమంగల్ బ్లాక్ కమిటీ అధ్యక్షులు యాట నరసింహ, చౌదర్పల్లి సర్పంచ్ భారతమ్మ గోపాల్ ,ప్రదీప్ రెడ్డి ,అంజయ్య గుప్తా తదితరులు ఉన్నారు.

## రేవంత్ సర్కార్ ది కక్ష సాధింపు రాజకీయం

**శంకర్‌పల్లి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** విచారణ పేరుతో రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే రేవంత్ సర్కార్ మూల్యం చెల్లించక తప్పదని శంకర్ పల్లి మండల పార్టీ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బద్దం శశిధర్ రెడ్డిలు హెచ్చరించారు. శంకర్ పల్లి మున్సిపల్ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని గుర్తు చేశారు. మూడేళ్లుగా రేవంత్ రెడ్డి సర్కార్ చేసిన ఆరోపణలు రాజకీయ గ్రామాలన్నీ హైకోర్టు బట్టబయలు చేసిందని స్పష్టం చేశారు. రైతులకు నీళ్లు ఇవ్వాల్సిన ప్రభుత్వం కాళేశ్వరాన్ని కాపాడాల్సింది పోయి, ప్రతీకార రాజకీయాలతో కాలం గడుపుతోందని విమర్శించారు. రెండు పిల్లర్లకు మరమ్మతు చేస్తే సరిపోయే ప్రాజెక్టును మూలనపడేసి మూడేళ్లుగా తెలంగాణ రైతాంగాన్ని నిలువునా ముంచెత్తుతోందని విమర్శించారు. సమావేశంలో మాజీ ఎంపీపీ చిన్న నర్సింలు, అడ్వకేట్ ఉపేందర్ రెడ్డి, సొసైటీ మాజీ డైరెక్టర్ మహేందర్ రెడ్డి, శేరిగూడ సర్పంచ్ నివేదిత ఇంద్రసేన రెడ్డి, చెందిప్ప సర్పంచ్ మల్లికార్జున్, మాజీ సర్పంచులు బి శ్రీధర్, శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ శ్రీనాథ్ గౌడ్, కౌన్సిలర్ లు ఉషాకిరణ్ విజయ్, ప్రశాంత్, బిఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి,మహేష్, జూలకంటి మహేందర్ రెడ్డి, మానయ్యా, ఆసిఫ్, భాస్కర్, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మలికార్జున్ ఖర్గే దిష్టిబొమ్మ దహనం

**కుల్కచర్ల,ఏప్రిల్,24 ప్రభాతవార్త:** కుల్కచర్ల మండల కేంద్రంలోని బిజెపి నాయకులు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షడు మలికార్జున్ ఖర్గే ప్రధాని నరేంద్ర మిదీపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కుల్కచర్ల మండల కేంద్రంలోనిబిజెపి పార్టీ మండల అధ్యక్షులు గుడాల వెంకటేష్ ఆధ్వర్యంలో మలికార్జున్ ఖర్గే దిష్టిబొమ్మ దహనం చేశారు.ఈ సందర్భంగా టెలికాం అడ్వైజర్ కమిటి మెంబర్ వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ...140 కోట్ల మంది ప్రజలఆశీర్వాదంలో వరుసగా మూడోసారి పీఠాన్ని అధిరోహించిన ప్రధానిని అవమానించడం అంటే ప్రజా తీర్పును కాలితో తన్నడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సర్పంచ్ అంజిలయ్య,దిశకమిటి మెంబర్ జానకిరామ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మహిపాల్ మాట్లాడుతూ..ప్రధాని నరేంద్ర మోదిని ఉద్దేశించి కాంగ్రెస్‌జాతీయ అధ్యక్షడు మల్లికార్జున్ ఖర్గే చేసిన'టెర్రరిస్ట్'లనే వ్యాఖ్యలు అంత్యత అభ్యంతరకరమని,ఇవి ఆయన అజ్ఞానానికి, దిగజారుడు రాజకియాలకు నిదర్శనమని తీవ్రంగా ఖండించారు.ఈ కార్యక్రమంలో మహిళ మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు మాజి సర్పంచ్ సౌమ్య రెడ్డి,సినియర్ నాయకులు చంద్రలింగం, కర్ణయ్య,ఉపాధ్యక్షులు కొండ ఆంజనేయులు, కృష్ణ, రాంచద్రయ్య,లాలు, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.


మలికార్జున్ ఖర్గే దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బిజెపి నేతలు

## గ్రామ అభివృద్ధికి సహకరించాలి

**జిల్లేడు చౌదరి గూడెం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** ప్రజలందరూ గ్రామం అభివృద్ధి చెందడానికి పూర్తిస్థాయిలో సహకరించాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా తుమ్మలపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన గ్రామసభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులందరికి అందజేయాలని అన్నారు. ప్రభుత్వం నుండి విడుదలవుతున్న నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సనా సలీం, పంచాయతీ కార్యదర్శి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతో గ్రామాభివృద్ధి : సర్పంచ్ శ్రీనివాస్

**మోమిన్‌పేట్, ఏప్రిల్ 24. ప్రభాతవార్త:** నాపై ఎంతో అభిమానం, ఆప్యాయతతో ఓట్లు వేసి సర్పంచ్‌గా గెల్పించిన మన గ్రామప్తులందరి సహకారంతో, పంచాయతీ పాలకవర్గ సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి మండలంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చడం ఖాయమని వెల్‌చాల్ గ్రామ సర్పంచ్ కావలి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన పంచాయతిరాజ్‌దినోత్సవ సంధర్భంగా గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ సంధర్భంగా వెల్‌చాల్ గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతు గ్రామంలోని ప్రతి ఒక్కరు, పంచాయతీ పాలకవర్గం సహకారంతో గ్రామంలో ఇంకా అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని తెలిపారు. గతంలో ఎప్పుడూ చేయలేని విధంగా గ్రామానికి మౌలిక వసతులైన పనులు, ముఖ్యంగా త్రాగు నీటి సౌకర్యం కొరకు ప్రతి బావి, బోరు బావులయందు మోటార్లు అమర్చి మంచినీటి కొరత లేకుండ చేయడం, అలాగే నేను సర్పంచిగా గెలిచిన అనతి కాలంలోనే ప్రధాన వీధులగుండా, గల్లి గల్లిలో సిసి రోడ్లు 80శాతం పూర్తి చేయడం జరిగిందని అన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీనివాస్. పంచాయతి కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి.

అలాగే గ్రామంలో పాడుబడ్డ ఇండ్లు, శిధలావస్థలో ఉన్న ఇండ్లను పూర్తిగా తొలగించడం జరిగిందని తెలిపారు. ఎన్ఆర్ఈజిఎస్ నిధులు రూ.10 లక్షల వ్యయంతో వర్కు షెడ్ భవననిర్మాణం కూడా నిర్మించడం జరిగిందని అన్నారు. త్వరలో ప్రాధమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని కూడా నిర్మిస్తామని, ఇంకా మన గ్రామాభివృద్ధికి ఎన్ని నిధులైనా మంజూరు చేయడానికి మనకు దైవసమానులైన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ చలువతో వెల్‌చాల్ గ్రామాన్ని మండలంలోనే ఆధర్శ గ్రామంగా చేయడమే సర్పంచిగా నా కర్తవ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజల రమేష్, వార్డు సభ్యులు, గ్రామస్తులు, యువకులు, మహిళలు, పంచాయితి కార్యధర్శి వెంకటేశ్వర్ రెడ్డి, పంచాయితి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎయులో ఎస్ఈఏటిఎన్‌జీఏ 2026 అంతర్జాతీయ సదస్సు

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 24, ప్రభాత వార్త:** మారుతున్న సాంకేతిక కాలంలో విద్యార్థులు, పరిశోధకులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంధన వనరుల ప్రాధాన్యతను గుర్తించాలని అనురాగ్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ అర్చన మంత్రి అన్నారు. పోచారం డివిజన్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీలో రెండు రోజుల పాటు నిర్వహించే



అనురాగ్ యూనివర్శిటీలో ఎస్ఈఏటిఎన్‌జీఏ 2026 సదస్సు వేడుకల సావనీర్ ఆవిష్కరిస్తున్న వైస్ ఛాన్సలర్ అర్చన మంత్రి తదితరులు.

ఎస్ఈఏటిఎన్‌జీఏ 2026 అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సస్టైనబుల్ ఎనర్జీ ఎఐ టెక్నాలజీస్ ఫర్ నెక్స్ట్ జనరేషన్ అప్లికేషన్స్ అనే అంశంపై మొదటి అంతర్జాతీయ సదస్సుకు తెలంగాణ ప్రభుత్వ ఆటోమోటివ్ ఈవీ విభాగపు డైరక్టర్ గోపాల కృష్ణన్, ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్ ఆర్కిటెక్ట్ బి. కిరణ్‌బాబు హాజరయ్యారు. యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ విజయ్ కుమార్, ఎలక్ట్రికల్ విభాగం అధిపతి డాక్టర్ మహమ్మద్ యాసీన్, సదస్సు చైర్ పర్సన్స్ టి. అనిల్ కుమార్, హరీశ్, శ్రీకాంత్ గౌడ్, ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దేవాలయ అభివృద్ధికి కృషిచేసి ప్రశంసలు అందుకున్న సర్పంచ్

**పెద్దేముల్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** ఎన్నికలలో ఇచ్చిన మాటను నిలబెట్టుకొని



దేవాలయ అభివృద్ధికి కృషిచేసి ఆదర్శంగా నిలిచిన సర్పంచ్ గ్రామస్థులు ప్రశంసలు అందుకున్నారు. పెద్దేముల్ మండలం ఊరెంటితాండాలో గత సర్పంచ్ ఎన్నికలలో సర్పంచ్‌గా గెలిపిస్తే సంత్ సేవాలాల్ మహరాజ్, భవాని మాత ఆలయాలకు స్లాబ్ వేయిస్తానని అభ్యర్థి సువార్ణ ధన్‌సింగ్ హామీ ఇచ్చారు. గ్రామస్థులు కూడా సువార్ణ ధన్‌సింగ్‌ను సర్పంచ్‌గా గెలిపించి తమ మాటను నిలబెట్టుకున్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి సర్పంచ్ సువార్ణధన్‌సింగ్ శుక్రవారం భవానిమాత, సేవాలాల్ మహరాజ్ ఆలయాలకు స్లాబ్ వేయించి గ్రామానికి ఆదర్శంగా నిలిచారు. హామీలను అమలు చేసి ఆదర్శంగా నిలిచిన సర్పంచ్ సువార్ణధన్‌సింగ్‌ను గ్రామస్థులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రతన్‌సింగ్, వార్డు సభ్యులు స్వరూప, గోపాల్, లాలిబాయి, తుకారం, మాజీ యంపిటిసిలు ధన్‌సింగ్, హరిసింగ్, మాజీ సర్పంచ్ టోప్యా నాయక్, రాథోడ్ గోపాల్, చవాన్ గోపాల్, చవాన్ రాంసింగ్, మాజీ మెంబర్ గోపాల్, రవికుమార్, లక్ష్మి బాయి, అనితాబాయి, ముత్యాలిబాయి తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా

..ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**పెద్దేముల్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణి చేస్తున్న ఎమ్మెల్యే

అన్నారు. శుక్రవారం పెద్దేముల్, కోటపల్లి మండలాలకు సంబందించి 32 మంది లబ్ధిదారులకు రూ. 32,03712 లక్షల విలువ గల కల్యాణలక్ష్మి, శాదిముబారక్ చెక్కులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసంక్షేమం, అభివృద్దే సిఎం రేవంత్ సర్కార్ ప్రధాన ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు ధారాసింగ్, కోటపల్లి మార్కెట్ కమిటి అధ్యక్షులు అంజయ్య, ఉపాద్యాక్షులు ఎస్.నారాయన్‌రెడ్డి, సర్పంచ్‌లు డివై నర్సిములు, సుమిత్ర రాథోడ్, టీపీసీసీ మైనార్టీ కన్వీనర్ యండి, రియాజ్, మండలపార్టీ అధ్యక్షులు కొండపురం గోపాల్, జిల్లా మాజీ అధ్యక్షురాలు శోభారాణి, మాజీ యంపిటిసి విద్యాసాగర్, నాయకులు రుద్రారం మహిపాల్‌రెడ్డి, సాయిని శ్రీనివాస్‌రెడ్డి, కోటపల్లి బందెన్న, జ్ఞానేశ్వర్, డివైనర్సిములు, జైపాల్‌రెడ్డి, నాగులపల్లి శేఖర్, తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# డైఫు కంపెనీ తీరుపై ఆగ్రహం

**ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కార్మికులను ఉద్యోగాల తొలగింపు**

**బాధితులకు మద్దతుగా బిజెపి మాజీ మండల అధ్యక్షుడు కిరణ్ నిరసన**

**షాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** చందనవెల్లి పారిశ్రామిక వాడలోని డైఫుకు కంపెనీలో ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కార్మికులను అకస్మాత్తుగా ఉద్యోగాల నుంచి తొలగించడం, చివరి నెల జీతాలు కూడా చెల్లించకపోవడంపై బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కంపెనీ గేటు ముందు బాధిత కార్మికులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 1వ తేదీన కంపెనీలో పనిచేస్తున్న 18 మంది ఉద్యోగులను తొలగించడమే కాకుండా, వారు కష్టపడి పనిచేసిన చివరి నెల జీతాలను కూడా ఇవ్వకపోవడం ఏంటని ప్రశ్నించారు. వెంటనే పెండింగ్ జీతాలు చెల్లించాలని, అక్రమ తొలగింపులపై యాజమాన్యం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనకు బీజేపీ షాబాద్ మాజీ మండల అధ్యక్షుడు కిరణ్ కుమార్ మద్దతుగా నిలిచారు. ఆయన మాట్లాడుతూ





చందనవెల్లి పారిశ్రామిక వాడలోని డైఫుకు కంపెనీ ముందు నిరసన తెలుపుతున్న బాధిత కార్మికులు

ముందస్తు నోటీసులు లేకుండా ఉద్యోగులను తొలగించడం కార్మిక చట్టాలకు విరుద్ధమని పేర్కొన్నారు. తొలగించిన ఉద్యోగులకు చివరి నెల జీతాలు వెంటనే చెల్లించి, బాధితులకు న్యాయం చేయాలని యాజమాన్యాన్ని హెచ్చరించారు. కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం మానుకోవాలని సూచించిన కిరణ్ కుమార్, యాజమాన్యం సానుకూలంగా స్పందించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ తరఫున అండగా ఉంటామని స్పష్టం చేశారు.

## బత్తుల రామరాజుయాదవ్ గ్రామానికి అందించిన సేవలు చిరస్మరణీయం

..18వ వర్ధంతి సందర్భంగా నివాళులు..అనాధ ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం

**శామీర్‌పేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**

శామీర్‌పేట గ్రామ మాజీ సర్పంచు స్వర్గీయ బత్తుల రామరాజుయాదవ్ రెండు సార్లు గ్రామ సర్పంచుగా పని చేసి శామీర్‌పేట, బాబగూడ గ్రామాలభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ఆయన సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం శామీర్‌పేటలోని మాజీ సర్పంచు, స్వర్గీయ బత్తుల రామరాజుయాదవ్ 18వ వర్ధంతిని పురస్కరించుకుని నివాసంలో ఆయన కుమారుడు, మాజీ సర్పంచు బత్తుల కిషోర్‌యాదవ్ స్వర్గీయ రామరాజుయాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయనతో పాటు రాష్ట్ర హాజ్ కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్‌తో పాటు పలువురు నాయకులు పార్టీలకు అతీతంగా విచ్చేసి నివాళులు అర్పించారు. ఆ తరువాత శామీర్‌పేట గ్రామంలోని మాతృశ్రీ అనాధ వృద్దా ఆశ్రమంలో స్వర్గీయ రామరాజుయాదవ్ కుమారుడు శామీర్‌పేట గ్రామ మాజీ సర్పంచు బత్తుల కిషోర్‌యాదవ్ అనాధ వృద్దులకు అన్నదానం చేశారు. ప్రతి ఏటా తన తండ్రి స్వర్గీయ బత్తుల రామరాజుయాదవ్ జ్ఞాపకార్థం పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు బత్తుల కిషోర్‌యాదవ్‌తో పాటు



శామీర్‌పేటలోని అనాధ ఆశ్రమంలో రామరాజుయాదవ్ వర్ధంతి సందర్భంగ అనాధలకు అన్నదానం చేసిన ఆయన కుమారుడు మాజీ సర్పంచు బత్తుల కిషోర్‌యాదవ్, పాల్గొన్న తదితరుల దృశ్యం

రాష్ట్ర హాజ్‌కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్, మాజీ ఎంపిటిసి సభ్యులు దప్పు సాయిబాబు, డి.కుమార్, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు వై.శంకర్‌గౌడ్, మాజీ ఉపసర్పంచు నర్ల రమేశ్, సొసైటీ మాజీ వైస్‌చైర్మన్ ఎం.ఐలయ్యయాదవ్, బత్తుల ప్రభాకర్‌యాదవ్, డి.బాబు, బి.వెంకటేశ, విష్ణు, డి.శ్రీనివాస్, బుర్క వెంకటేశ, బి.నర్సింగ్‌రావు, ఎం.నర్సింగ్‌రావు, పరుశరాం, డి.నాగేశ్, నరేశ్, గన్‌రెడ్డి, బి.సత్యనారాయణ, అనిల్‌గౌడ్, సునిల్‌రెడ్డి, ఆనంద్, ప్రభాకర్, విష్ణు, వి.ఎల్లం, బాబు, ఎస్.శ్రీనివాస్, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా వీరనాగమ్మ కళ్యాణ మహోత్సవం



వీరనాగమ్మ కళ్యాణం మహోత్సవంలో పాల్గొన్న పలువురు నాయకులు

**కేశంపేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో కన్నుల పండుగ వీరనాగమ్మ తల్లి కళ్యాణ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారు చెడును శిక్షి ఒచి మంచిని ప్రోత్సహిస్తుందన్నారు. ఎలాంటి పకృతి వైఫల్యాలు అనారోగ్యాలు లేకుండా చూడాలని పంటలు బాగా పండి ప్రజలు సంతోషంగా ఉండాలని వీరనాఘమ్మ తల్లిని వేడుకున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్ రెడ్డి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ లక్ష్మీ ్మనారాయణ గౌడ్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ జగదీశ్వర్ గౌడ్, మాజీ సర్పంచ్ నవీన్ కుమార్, మాజీ ఎంపీటీసీ మల్లేష్ యాదవ్, ఉప సర్పంచ్ కర్నాటి దర్శన్, పర్వత రెడ్డి, జమాల్ ఖాన్, కృష్ణ, రాజు, సంతోష్ కుమార్, ఆరెకటిక సంఘం సభ్యులు రాజు, నవీన్, మహేష్, విజయ్, సందీప్, ప్రవీణ్, నాగరాజు, శీను గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మామపై అల్లుడి దాడి

## : ఇనుపరాడుతో దెబ్బ, నాలుగు కుట్లు

**మొయినాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** కాలు కడిగి కన్యాదానం చేసిన మామపై అల్లుడు ఇనుపరాడుతో దాడి చేసిన ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మూర్తుజగూడ గ్రామానికి చెందిన గుల మల్లేష్ (54) తన కుమార్తెను ఐదు సంవత్సరాల క్రితం శ్రీరాంనగర్ గ్రామానికి చెందిన కావలి నరేష్ (32) కు వివాహం చేశారు. అయితే గత మూడు నెలల క్రితం భార్యాభర్తల మధ్య చిన్న గొడవ జరగడంతో, మల్లేష్ కుమార్తె తన తండ్రి ఇంటికే వచ్చి ఉంటోంది.

ఈ క్రమంలో గురువారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో అల్లుడు నరేష్ మూర్తుజగూడలోని మల్లేష్ ఇంటికి వచ్చి తన భార్యతో వాగ్వాదానికి దిగాడు.

ఆ సమయంలో ఆమెను తిడుతూ నెట్టివేయగా, అక్కడే ఉన్న మల్లేష్ మనవరాలిని కూడా తోసేయడం గమనించాడు.

చిన్నపిల్లలను ఎందుకు ఇబ్బంది పెడుతున్నావని మామ మల్లేష్ మందలించగా, ఆగ్రహానికి లోనైన నరేష్ పక్కనే ఉన్న ఇనుప రాడ్‌తో మల్లేష్ ముక్కుపై బలంగా దాడి చేశాడు.

దీంతో మల్లేష్ తీవ్రంగా గాయపడి రక్తస్రావం కావడంతో వెంటనే ఆసుపత్రికి తరలించగా వైద్యులు నాలుగు కుట్లు వేశారు. ఈ ఘటనపై బాధితుడు మల్లేష్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రతి ఒక్కరైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి

వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్ శోభారాణి

**తలకొండపల్లి, ఏప్రిల్24, ప్రభాత వార్త;**

రంగారెడ్డిజిల్ల పరిధిలోని అన్ని మండలాల రైతులు తప్పకుండా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్ శోభారాణి అన్నారు. శుక్రవారంతలకొండపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించడం జరిగింది. భూమి కలిగిన ప్రతి రైతుకు సంబంధించిన భూ యాజమాన్య వివరాలు, వ్యక్తిగత సమాచారం ఆధారంగా ఫార్మర్ రిజిస్ట్రీ రూపొందించబడుతుందని వారు తెలియజేశారు.

ముఖ్యంగా పిఎం కిసాన్ పథకము తదుపరి విడతల లబ్ధి పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరి అని కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినట్లుఆమె తెలిపారు. రాబోయే వ్యవసాయ సీజన్ నుండి రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అయిన రైతు భరోసా, రుణమాఫీ, మొక్కజొన్న, పత్తి, ధాన్యం కొనుగోలు, యూరియా మరియు ఇతర ఎరువుల పంపిణీకి ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అవుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా, యూరియా వినియోగంపై సెన్సిటైజేషన్ కార్యక్రమం నిర్వహించి, రైతులు సరైన మోతాదులో ఎరువులను వినియోగించాలని సూచించారు.

రైతులు తమ ఆధార్ కార్డు, భూ యాజమాన్య పాస్ బుక్, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నెంబర్‌తో సమీపంలోని వ్యవసాయ విస్తరణ అధికారి లేదా సమీప మీసేవ కేంద్రాలను సంప్రదించి వెంటనే ఫార్మర్ ఐడి నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు నెల ఏప్రిల్ 22 నుండి 30వ తేదీ వరకు మండలంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించబడుతుంది. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ శోభారాణి, ఎంఆర్వో కోడంగల్ రమేష్ కుమార్ , సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, మండల వ్యవసాయ అధికారి రేణుక , ఆర్ఐ శ్రవణ్ , ఏఈఓలు శ్రీనాథ్, సుష్మిత, అర్చనా, త్రైలోక్య, అనుష, అనిత గారు మరియు గ్రామపాలన అధికారులుతతితరులుపాల్గొన్నారు.

## నూతనగా ఎన్నికైన మత్స్యకార చైర్మన్, డైరెక్టర్‌లకు ఘన సన్మానం

**కేశంపేట్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :**

కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డి పల్లి పోమల్ పల్లి గ్రామా పంచాయితీ లో గల ఉమ్మడి మత్స్యకార సొసైటీ కి నూతన చైర్మన్‌గా కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఏర్పుల లింగం ముదిరాజ్ ను డైరెక్టర్‌గా ఏర్పుల రమేష్ ముదిరాజ్ లు ఇటీవల జరిగిన ఎన్నికల్లో నియమితులవడంతో గ్రామ పెద్దలు, సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్, ఉప సర్పంచ్ కే. నరేష్ ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులకు శాలువాలు కప్పి ఘన సన్మానం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ, ముదిరాజ్ సంఘం ఐక్యతతో ముందుకు సాగాలని, గ్రామాభివృద్ధిలో



నూతన మత్స్యకార కమిటీ సభ్యులు

సంఘం కీలక పాత్ర పోషించాలని సూచించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన లింగం ముదిరాజ్, రమేష్‌లు సంఘం అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామని తెలిపారుఅదేవిధంగా. సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని అన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ స్వరూప్, వార్డ్ సభ్యులు పీ. వెంకట్రాం రెడ్డి, అరవింద్, సంగీత, శిరీష, కుమ్మరి శేఖర్, డీలర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**ఆమనగల్లు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 5వవార్డుకు చెందిన దొంకి జంగమ్మ అనారోగ్యంతో కన్నుమూసింది. జంగమ్మ మరణవార్త తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ పాపిశెట్టిరాము, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఒగ్గు మహేష్, మాజీ కౌన్సిలర్ గోరటి నర్సిం హాలు వేరువేరుగా జంగ మ్మ పార్థివ దేహాన్ని సంద ర్శించి నివాళులు అర్పించి బాధిత కుటుంబానికి తమ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం ఓదార్పు కింద పాపిశెట్టిరాముతోపాటు ఒగ్గు మహేశ్ రూ. 5వేలు, గోరటి నరసింహ రూ. 3వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో పులికంటి చిన్న మైసయ్య, భీమయ్య, మహేష్, శివ, కార్తీక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



నగదును అందజేస్తున్న ఒగ్గు మహేష్



నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు బోడి వెంకట్‌రెడ్డి, జంగం వీరన్న

## పేదల గూడు..కాంగ్రెస్ తోడు

-దౌల్తాబాద్‌లో ఘనంగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

**దౌల్తాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**

దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన కుర్వ కాశమ్మ ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సొంతింటి కల సాకారమైంది. ఇందిరమ్మ పథకం ద్వారా నిర్మించుకున్న నూతన గృహంలోకి ఆమె శుక్రవారంరోజు కుటుంబ సభ్యులతో కలిసి ప్రవేశించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బోడి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం వీరన్నలు నూతన గృహాన్ని ప్రారంభించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ..గత ప్రభుత్వాల హయంలో ఇళ్లు లేక ఇబ్బందులు పడ్డ నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడుతామని అన్నారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణ పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేసేలా అధికారులతో మాట్లాడుతామని నాయకులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్దిదారుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా

**షాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** గ్రామ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కుమ్మరిగూడ గ్రామ సర్పంచ్ పోనమోని శ్రీశైలం యాదవ్ అన్నారు. శుక్రవారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా షాబాద్ మండలంలోని కుమ్మరిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామ అభివృద్ధికి నిరంతరం



షాబాద్ మండలం కుమ్మరిగూడ గ్రామ సభ సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ పోనమోని శ్రీశైలం యాదవ్

కృషి చేస్తామని తెలిపారు. వార్డు సభ్యులు తమ వార్డులలో ఉన్న సమస్యలను గుర్తించి తన దృష్టికి తీసుకువస్తే, అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామని స్పష్టం చేశారు. గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నా మన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు అందేలా చూస్తామని తెలిపారు. ప్రజలందరి భాగస్వామ్యంతో కుమ్మరిగూడ గ్రామాన్ని అన్ని రంగాలలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నారమోని భరత్ కుమార్, పంచాయతీ కార్యదర్శి యాదయ్య, వార్డు సభ్యులు నవీన్, దేశమళ్ల యాదగిరి, మహేందర్, పెద్దగోల్ల వసంత, చంద్రశేఖర్, జయలక్షి ్మ, శివనీల తదితరులు పాల్గొన్నారు.

## విమెన్ ఫ్రెండ్లీ పంచాయితీగా సంకేపల్లిగూడను మారుస్తా

సంకేపల్లి గూడ గ్రామ సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య



సంకేపల్లిగూడ గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య

**షాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** విమెన్ ఫ్రెండ్లీ పంచాయతీగా సంకపల్లిగూడ పంచాయతీని మార్చి, మహిళా అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని సంకేపల్లి కూడా గ్రామ సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య అన్నారు. పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని సంకేపల్లిగూడ పంచాయతీలో శుక్రవారం గ్రామ సభను సర్పంచ్ కుమ్మరి లావణ్యచెన్నయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుటుంబ అభివృద్ధిలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నట్లే, గ్రామాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమన్నారు. మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తూ ముందుకు సాగేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే గ్రామంలోని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. గ్రామ అభివృద్ధికి అందరూ సంయమనం పాటించి సహకరించాలని కోరారు. గ్రామాన్ని పచ్చదనం, పరిశుభ్రతలో అగ్రస్థానంలో నిలిపేందుకు గ్రామస్తుల సహకారంతో ముందుకు సాగుతామని వివరించారు. ప్రతి ఇంటిలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా వర్గీకరించి పంచాయతీ ట్రాక్టర్‌కు అందించాలని సూచించారు. గ్రామంలోని పలు సమస్యలపై చర్చించి వాటికి పరిష్కార మార్గాలను సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య, ఉప సర్పంచ్ ప్రభాకర్, వార్డు సభ్యులు సంతోష్, జయమ్మ, శ్రీనివాస్ రెడ్డి, సత్తయ్య, యాదమ్మ, పంచాయతీ కార్యదర్శి ఫయాజ్, అంగన్‌వాడీ టీచర్ పద్మావతి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ చంద్రకళ

## తింసాన్‌పల్లి గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించండి

...ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన సర్పంచ్ చంద్రకళ

**పెద్దేముల్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలం తింసాన్‌పల్లి గ్రామ పంచాయతీ అభివృద్ధికి నిధులు కేటాయించాలంటు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి తింసాన్‌పల్లి సర్పంచ్ చంద్రకళ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పెద్దేముల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శాధిముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణి కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేకు సర్పంచ్ వినతి పత్రం అందజేశారు. నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడ్డ తింసాన్‌పల్లి గ్రామానికి పంచాయతీ భవనం, గ్రామంలో మురుగు కాలువల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం, స్మశాన వాటిక దారిలో బ్రిడ్జి నిర్మాణం, ఎస్సి స్మశానవాటికకు కంపౌండ్‌వాల్, తాగునీటి సమస్య కోసం నూతన బోరుబావి, తదితర అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలంటు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్, నాయకులు రుద్రారం మహిపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, శోభారాణి, డివై నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మరాసిపేట్‌లో 16ఎకరాల ప్రభుత్వ భూమి గుర్తింపు

**శామీర్‌పేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**

బొమ్మరాసిపేట్ గ్రామంలోని వివిధ సర్వేనెంబర్లలో సుమారు 16ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని గుర్తించినట్లు, ఆ భూమికి పూర్తిగ త్వరలోనే పిన్నింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు శామీర్‌పేట మండల తహసీల్దార్ సుచరిత తెలిపారు. శుక్రవారం ఆమె ఈ విషయాన్ని తెలియజేశారు. శామీర్‌పేట మండలంలోని బొమ్మరాసిపేట్ గ్రామంలోని సర్వేనెంబరు 416/2లో 10ఎకరాల12గుంటలు, సర్వేనెంబరు 417/2లో 3ఎకరాల 13గుంటలు, సర్వేనెంబరు 429/2లో 3ఎకరాల 36గుంటల భూమిని ప్రభుత్వ భూములుగా గుర్తించినట్లు తెలిపారు. పైన పేర్కొన్న ప్రభుత్వ భూములకు వెంటనే పిన్నింగ్ ఏర్పాటు చేస్తామని, ఎవరైనా వ్యక్తులు ఈ ప్రభుత్వ భూములను ఆక్రమణలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శామీర్‌పేట మండల తహసీల్దార్ సుచరిత స్పష్టం చేశారు.